క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు పాల్గొన్నారు.

కాణిపాకంలో మహానంది వేదపండితుడికి సత్కారం



వేదపండితులు శాంతారాంభట్‌ను సన్మానించిన ఈఓ, చైర్మన్లు

మహానంది: కాణిపాకంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వేదసభలో మహానంది ఆలయ సామవేదం పండితులు శాంతారాంభట్‌ను సత్కరించారు. కాణిపాకం ఈఓ, చైర్మన్‌లు ఆయనను ఘనంగా సన్మానించి కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేయించారు. శాంతారాంభట్‌ను మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, పండితులు, అర్చకులు, సిబ్బంది అభినందించారు.

రేపు రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రం పరిధిలో ఈ నెల 30న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఏపీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాల సెక్రటరీ బాలమద్దిలేటి తెలిపారు. గురువారం మహానందిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతారని చెప్పారు. ప్రారంభోత్సవానికి నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరవుతారన్నారు. సమావేశంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న కాంట్రాక్ట్ వైద్యసిబ్బంది

ఆత్మకూరు: వైద్య శాఖలో 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ అసెంబ్లీలో ఆమోదం చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉన్నామని కాంట్రాక్ట్ జేఏసీ చైర్మన్ కరుణాకర్, కో చైర్మన్ విశ్వనాథ్‌లు అన్నారు. గురువారం పట్టణంలోని మలేరియా నిర్ధారణ కేంద్రంలో థాంక్యూ సీఎం సార్ ప్లకార్డులతో కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు రాజగోపాల్, భాస్కర్ పాల్గొన్నారు.

సాధువు మృతదేహానికి గ్రామస్తుల అంత్యక్రియలు



సాధువు లక్ష్మీనారాయణస్వామి (ఫైల్)

కొత్తపల్లి: మండలంలోని సింగరాజు పల్లె గ్రామంలో ఓ సాధువు మృతదేహానికి గ్రామస్తులంతా కలిసి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు ఇలా.. సింగరాజుపల్లెకు లక్ష్మీనారాయణ స్వామి(80)అనే సాధువు 13 క్రితం వలస వచ్చాడు. అప్పటి నుంచి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఉండేవాడు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతండగా.. బుధవారం సాయంత్రం ఆయన ఆరోగ్యం క్షీణించడంతో గ్రామస్తులు 108కి సమాచారం ఇచ్చారు. వారు ఆయనను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడని గ్రామస్తులు తెలిపారు. ఆయనకు ఎవరూ లేకపోవడంతో గ్రామస్తులంత ఏకమై అంత్యక్రియలు నిర్వహించారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న ఎంపీహెచ్ఏ పోస్టులను భర్తీ చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లిన స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డికి రాష్ట్ర పారామెడికల్ హెల్త్ అసిస్టెంట్ మేల్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ, ఉపాధ్యక్షుడు భరత్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ 2002 నుంచి నేటికి భర్తీ కాని హెల్త్ అసిస్టెంట్ మేల్ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు సీఎం సానుకూలంగా స్పందించడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రశాంత్‌రెడ్డి, మీరాసాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

గులాబీ రంగు పురుగును నివారిస్తే తెల్ల'బంగారమే'

- సస్యరక్షణ చర్యలే పంటరక్షణకు ప్రధానం
- ప్రస్తుతం చేతికందే దశలో పత్తి పంట
- పంటను ఆశిస్తున్న గులాబీరంగు పురుగు
- కొద్దిపాటి పురుగు మందులతోనే పురుగు నివారణ



గులాబీ రంగు పురుగు వ్యాపించడంతో ఎండిపోయిన పత్తికాయలు



తాటిపాడులో సాగు చేసిన పత్తిపంట

జూపాడుబంగ్లా: తగిన సస్యరక్షణ చర్యలు తీసుకొని సకాలంలో పంటను చీడ, పీడల నుంచి కాపాడుకుంటే పట్టిందంతా తెల్లబంగారమే అన్నట్లుగా పత్తి పంట ఉంటుంది. రెండేళ్లుగా పత్తిపంటకు గిట్టుబాటు ధర లభిస్తుండటంతో రైతులు సాగుపై దృష్టి సారించారు. ప్రస్తుతం దిగుబడి చేతికందే తరుణం ఆసన్నం కాగా పంటలో గులాబీ రంగు పురుగు వ్యాప్తి రైతులను కలవరపెడుతోంది. తగిన సస్యరక్షణ చర్యలు పాటిస్తే పురుగును నివారించి ఐంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

7,379 హెక్టార్లలో సాగు..

నందికొట్కూరు నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో 7,379 హెక్టార్లలో పత్తిపంటను సాగుచేశారు. నందికొట్కూరు మండలంలో 0.316 హెక్టార్లు, జూపాడుబంగ్లా 2,131, మిడుతూరు 3,028, పగిడ్యాల 0.360, పాములపాడు 0.197, కొత్తపల్లి మండంలో 1,347 హెక్టార్లలో పత్తి సాగయ్యింది. ప్రస్తుతం పత్తి దిగుబడి చేతికందే దశలో ఉండగా..పంటను గులాబీ రంగు పురుగు ఆశిస్తోంది. దీనిని నివారించకపోతే పంటనష్టం వాటిల్లి రైతులు తీవ్రంగా నష్టాన్ని చవిచూడాల్సి ఉంటుంది. గులాబీ పురుగు నివారణ కోసం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు పలురకాల సూచనలు ఇస్తున్నారు. రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

పురుగును గుర్తించడం ఇలా..

పత్తిలో గులాబీ రంగు పురుగు వ్యాపించిందంటే దాని లార్వా అభివృద్ధి కాయ లోపల జరుగుతుంది. కనుక పురుగు నివారణకు ఎలాంటి మందులు పనిచేయవు. ఈ పురుగు వ్యాప్తి వల్ల పంటలో 30 శాతం మేర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. పత్తి పంటలో గులాబీరంగు పురుగు వ్యాపించిందంటే చెట్టుకు గుడ్డిపూలు కాస్తాయి. తద్వారా పంటలో రంగు పురుగు వ్యాపించిందనే విషయాన్ని రైతులు గుర్తించాలి. కాయలపై పురుగు బయటకు వచ్చేంత మేర సన్నటి రంధ్రం ఏర్పడుతుంది. పురుగు వ్యాపించిన కాయలు పగిలినట్లయితే పత్తి గులాబీరంగులో కనిపిస్తుంది. గుడ్డిపత్తి ఏర్పడటం, కాయలు సరిగ్గా విచ్చుకోకపోవటం జరుగుతుంది.

పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు

పంటలో గులాబీ రంగు పురుగు వ్యాపించకుండా పంట నాటిన 45 రోజుల్లోనే ఎకరాకు ఐదు చొప్పున లింగాకర్షణ బుట్టలు, ఎల్లో కార్డులు ఏర్పాటు చేసుకోవాలి. తద్వారా పంటలో పురుగు వ్యాప్తిని నివారించటంతో పాటు ముందుగానే గుర్తించవచ్చు. 60 నుంచి 120రోజుల తర్వాత వారానికి మూడు పర్యాయాల చొప్పున పరాన్నజీవియైన ట్రైకోగామ బ్యాక్టీరియాను ఎకరాకు 60వేల చొప్పున విడుదల చేయటం వల్ల గుడ్లదశలోనే పురుగు వ్యాప్తిని నివారించవచ్చు. రెండు, మూడు రకాల పురుగు మందులు కలిపి విచ్చలవిడిగా పిచికారీ చేయకుండా ఓ పురుగుమందుతో పాటు వేపనూనెను కలిపి పిచికారీ చేసుకోవాలి. తద్వారా పంటలపై పురుగులు గుడ్లు పెట్టకుండా ఉంటాయి.

మందులు అధికంగా వాడరాదు

మోనోక్రొటోఫాస్, అసిఫేట్ వంటి మందులను అధికంగా వాడరాదు. పంట 60–120రోజుల వ్యవధిలో ఉన్నప్పుడు క్లోరోపైరిఫాస్, క్వినాల్‌ఫాస్, లేదా థయోడికార్బ్ లేదా ప్రొఫినోఫాస్, పదిలీటర్ల నీటిలో 30 మిల్లీలీటర్ల మందును కలిపి పిచికారీ చేయాలి. పంట 120 రోజులున్నప్పుడు సైఫర్‌మైత్రిన్ లేదా లాంమ్డాసైహాత్రిన్, లేదా ఫెన్వలరేట్ ను పదిలీటర్ల నీటిలో 10 మిల్లీలీటర్ల మందును కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయశాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

మెలకువలు పాటిస్తే మెరుగైన దిగుబడి వస్తుంది



పత్తి పంట సాగులో కొద్దిపాటి సస్యరక్షణ చర్యలు పాటిస్తే మెరుగైన దిగుబడిని సాధించవచ్చు. ముందుగా విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించి నాణ్యమైన, పొలానికి అనువైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలి. పత్తి నీటిబెట్టను తట్టుకుంటుంది కనుక నీటితడులు ఎక్కువగా పెట్టకుండా, పురుగు మందులు అధికంగా వాడకుండా ఉండాలి. లింగాకర్షణ బుట్టలు పెట్టుకోవటం, ట్రైకోగామా పరాన్నజీవులను వదులుకోవడం, నీమాయిల్‌ను పిచికారి చేసుకోవడం వంటి జీవరసాయనిక మందులను పంటపై పిచికారి చేసుకోవాలి. గులాబీ రంగు పురుగు వ్యాపించటానికి ముందే అప్రమత్తమై వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే పంటను కాపాడుకోవచ్చు.

– కృష్ణారెడ్డి, వ్యవసాయ అధికారి, జూపాడుబంగ్లా

ఇలా చేయకూడదు..

దగ్గర దగ్గర పత్తి విత్తనాలు నాటుకోకూడదు. పంట నాటిన నెలరోజుల్లో పురుగు మందులను వాడరాదు. పంట పంట సాగుచేసిన 4నెలల వరకు సింథటిక్ పైరిత్రాయిడ్ మందులను పంటపై పిచికారీ చేయరాదు. గులాబీరంగు పురుగు నివారణకు చివరిదశలో ఒకటి లేదా రెండు మార్లు మాత్రమే పంటపై సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు పిచికారీ చేసుకోవాలి. అలాగే నత్రజని ఎరువులను అధికంగా వేయరాదు. ఎక్కువగా నీటిని పెట్టడం, పొలంలో నీళ్ల నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

టీడీపీ గ్రాఫ్ పడిపోతున్నా గంభీర స్టేట్‌మెంట్లా?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరురూరల్: తెలుగు దేశం నాయకుల గ్రాఫ్ సున్నాకు పడిపోతున్నా వారు కళ్లకు గంతలు కట్టుకుని తిరిగిన గాడిలోనే తిరిగే గానుగెద్దుల్లా అర్థం పర్థం లేని స్టేట్ మెంట్లు ఇస్తూ దిగజారి పోతున్నారని ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్, జెడ్పీటీసీ శంకరరెడ్డి అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలుగుదేశం నాయకులు దీక్షా శిబిరం నుంచి ఇస్తున్న అర్థం పర్థం లేని ప్రకటనలను ఖండించారు. అవినీతి కేసులో చిక్కి జైలుపాలైన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి చేస్తున్న దీక్షలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తన తాహతకు మించి ఎమ్మెల్యే చక్రపాణి రెడ్డి పై అవాకులు, చవాకులు పేలుతున్నారని అన్నారు. ఇంటర్ మీడియట్ వరకు చదువుకున్న ఎంతో ప్రపాపంచిక జ్ఞానం ఉన్న శిల్పా చక్రపాణి రెడ్డిని చదువు లేని వాడుగా ఎద్దేవా చేస్తున్న బుడ్డా తన వీపును తాను చూసుకు మాట్లాడాలన్నారు. వారి ఇంట్లోనే హైస్కూలు దాటని వారు మంత్రి పదవి పొందారు కదా అని ఎద్దేవా చేశారు. టీడీపీ నాయకులు దిగజారి చేస్తున్న వ్యక్తిగత దూషణలను మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు పయ్యద్ మీర్, రాజమోహన్ రెడ్డి, పార్టీ జిల్లా లీగల్ సెల్ వైస్ ప్రసిడెంట్ నగేష్, నాయకులు పువ్వాడి భాస్కర్, కే విజయ్ చౌదరి, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ ఆశయాలు స్ఫూర్తిదాయకం



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

జూపాడుబంగ్లా: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రజకసంఘం మండల అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. ఐలమ్మ జయంతిని గురువారం పాములపాడు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పలువురు రజక సంఘం నాయకులు మాట్లాడుతూ రాజాకారులతో భూ ఉద్యమం చేసి వారి ఆధీనంలో ఉన్న పేదలకు చెందిన 900 ఎకరాల భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయించిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మండలంలోని వివిధ గ్రామాల్లోని రజకులు ఐక్యమత్యమై ఎస్సీ రిజర్వేషన్ సాధనకోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో శ్రీశైల రజకసత్రం కోశాధికారి గోపాల్, ధర్మయ్య, దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శీలం శ్రీనివాసులు, జూపల్లి లింగస్వామి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

కేశవరెడ్డిని లీగల్ సెల్ నుంచి తొలగించి సంవత్సరం అయ్యింది



బొల్లు నగేష్ యాదవ్

ఆత్మకూరురూరల్: అడ్వొకేట్ కేశవరెడ్డిని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నుంచి తొలగించి సంవత్సరం పైనే అయ్యిందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఉపాధ్యక్షులు బొల్లు నగేష్ యాదవ్ ప్రకటించారు. గురువారం ఆయన ఆత్మకూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ వారి దీక్షలకు హాజరై వారి మద్దతు తెలుపుతూ.. తాను ఈ రోజు వరకు స్థానిక వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఉన్నానంటూ అబద్దాలు చెబుతున్నారన్నారు. ఇప్పుడే జ్ఞానోదయమైందని, టీడీపీ నాయకుడు చంద్రబాబు అరెస్టును ఖండిస్తానని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. ఏవో పదవులు ఆశించి పార్టీ అనుబంధ సంఘాల్లో పని చేస్తూ.. పదవులు రాకపోతే తమ మద్దతును ఫిరాయించడం ఈ రోజుల్లో ఫ్యాషన్‌గా మారిందని ఎద్దేవా చేశారు. అంతేకాక దీక్షా శిబిరంలో పాల్గొన్న కొందరు సీనియర్ న్యాయవాదులు చంద్రబాబు నాయుడుకు రిమాండ్‌పై జడ్జి నిర్ణయాన్ని వ్యతిరేకించడమే కాక, అనుచితంగా మాట్లాడారన్నారు. న్యాయవాదులుగా హుందాగా వ్యవహరించాలని, సమాజానికి ఒక రోల్ మోడల్ గా ఉండాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు సుబ్రహ్మణ్యం, మాణిక్యరావు, రంగస్వామి, రామకృష్ణ, ఫజుల్ రహమాన్, నర్సింహుడు తదితరులు పాల్గొన్నారు.

భ్రామరీకి లక్షకుంకుమార్చన



లక్షకుంకుమార్చన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి గురువారం పౌర్ణమి ఘడియలు ప్రారంభమవడంతో సాయంత్రం లక్షకుంకుమార్చన సేవను శాస్త్రోక్తంగా జరిపించారు. శ్రీశైలానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో లక్షకుంకుమార్చనలో భక్తులు పరోక్షసేవగా పాల్గొనే అవకాశం దేవస్థానం కల్పించింది. ఈ మేరకు 27 మంది భక్తులు పరోక్షసేవ ద్వారా పూజల్లో పాల్గొన్నారు. ఈ సేవలో భాగంగా అర్చకులు ముందుగా పూజాసంకల్పం పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజను జరిపి శాస్త్రోక్తంగా లక్షకుంకుమార్చన సేవను జరిపించారు.

స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోకకల్యాణం కోసం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. గురువారం శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని, ఊయలసేవను చేపట్టారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

ప్రవక్త చూపిన మార్గంలో నడవాలి



ఆసర్ మసీదులో మహమ్మద్ ప్రవక్త తలనీలాలను దర్శించుకుంటున్న ముస్లింలు

ఆత్మకూరు: మహమ్మద్ ప్రవక్త చూపిన శాంతి, ధర్మం, న్యాయం, అహింసా మార్గాల్లో ప్రజలు నడవాలని ముస్లిం మత పెద్దలు సూచించారు. పట్టణంలో గురువారం మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంతమార్కెట్ సమీపంలోని ఆసర్ మసీదులో మహమ్మద్ ప్రవక్త తలనీలాలను ప్రదర్శించారు. అనంతరం మసీదు కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆసర్ సయ్యద్ మాలిక్, కదీర్, సలాంబాషా, సొసైటీ హాజీ ఖాదర్, గౌస్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: పట్టణంలోని ఆసర్ పేటలో మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఆసరే షరీఫ్‌లో మౌలానా ఇబ్రహీం, అహమ్మద్ హుసేన్ సూక్తులు బోధించారు. మహమ్మద్ ప్రవక్త తలనీలాలు ప్రదర్శించారు.

మహానంది/జూపాడుబంగ్లా/పాములపాడు: మహానంది, బండిఆత్మకూరు, జూపాడుబంగ్లా, పాములపాడు మండలాల్లో గురువారం మిలాదున్ నబీ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లిం పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ప్రవక్త బోధనలను వినిపించారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి ఎంపీపీ సహకారం

మహానంది: బండిఆత్మకూరు మండలం లింగాపురం గ్రామంలోని శ్మశానవాటిక అభివృద్ధికి ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి సహకారం అందించారని గ్రామస్తులు ఇస్మాయిల్, యోగయ్య తెలిపారు. గురువారం జేసీబీ సాయంతో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అంత్యక్రియలకు వెళ్లడానికి కంపచెట్లు, పిచ్చిచెట్లు ఇబ్బందిగా ఉండేదని, అడిగిన వెంటనే ఎంపీపీ సంజీవరెడ్డి సహకరించారన్నారు.

ఇంటింటి సర్వే 80 శాతం పూర్తి



తల్లీబిడ్డలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సభా

జూపాడుబంగ్లా: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని జూపాడుబంగ్లా, పారుమంచాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో 80 శాతం సర్వే పూర్తి చేసినట్లు వైద్యులు డాక్టర్ గంగాధర్, డాక్టర్ మౌనిక తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. సర్వేలో గుర్తించిన వ్యాధిగ్రస్తులు, రోగపీడితులకు అవసరమైన మెరుగైన చికిత్సల నిమిత్తం టోకెన్లు అందజేసినట్లు తెలిపారు. అక్టోబర్ 4 నుంచి ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్ష గ్రామసభల్లో వారికి మెరుగైన చికిత్సలు అందించేందుకుగాను కర్నూలు ప్రభుత్వ వైద్యశాల, కార్పొరేట్ ఆసుపత్రులకు పంపనున్నట్లు తెలిపారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

వెలుగోడు: ఏ పంటయినా సరే విత్తన శుద్ధి చేస్తే కొన్ని రకాల తెగుళ్లను మొదట్లోనే నివారించవచ్చని సెంచురియా విశ్వ విద్యాలయం విద్యార్థి హ్ .నరసింహ తెలిపారు. గురువారం రేగడగూడురు గ్రామంలో ఖరీఫ్ సాగుపై నరసింహ రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలను శుద్ధి చేయకుంటే పంట ఎదుగుదల, దిగుబడి తగ్గి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.

'కార్పొరేట్ శక్తులకు బీజేపీ ఊడిగం'

పాములపాడు: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని సీపీఎం జిల్లా నాయకుడు రమేష్‌కుమార్ అన్నారు. గురువారం పాములపాడులోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో ప్రతి ఏటా రెండుకోట్ల చొప్పున తొమ్మిదేళ్ల పాలనలో 18 కోట్ల నిరుద్యోగులు పెరిగారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు స్వామన్న, వెంకటేశ్వరరావు, బాలయ్య, బాలయేసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

4న రాష్ట్రస్థాయి కళాకారుల సమావేశం

మహానంది: మహానందిలోని టీటీడీ కల్యాణ మండపంలో అక్టోబర్ 4వ తేదీన రాష్ట్రస్థాయిలోని జానపద కళాకారులు, భజన గురువుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కళాకారుడు, కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర నేత నల్లగట్ల వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. టీటీడీ అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామిజీ హాజరవుతారన్నారు. చెక్కభజన, తాళం భజన, కోలాటం తదితర రంగాలకు చెందిన కళాకారులు హాజరుకావాలన్నారు. చాకలి వెంకటేశ్వర్లు, రత్నాలు, బుజ్జయ్య, కాశన్న పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

పాములపాడు: మండలాన్ని కరువుమండలంగా ప్రకటించి ఖరీఫ్ పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలో వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన మొక్కజొన్న పంటలను సీపీఎం పార్టీ నాయకులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం మంజూరు చేయాలని కోరారు. అలాగే పంటనష్టం వాటిల్లిన రైతులకు వందశాతం రాయితీపై విత్తనాలు, బ్యాంకుల్లో వడ్డీలేని రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు.

పొలాల్లో అడవి పందుల బీభత్సం

మహానంది: అడవి పందులు పంటపొలాల్లో బీభత్సం సృష్టించడంతో తీవ్రంగా నష్టపోయామని బసవాపురం గ్రామానికి చెందిన రైతులు నాగేశ్వరరావు, షేక్ మా బాష, హుసేన్ బాషా తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు విషయం తెలుసుకుని గురువారం పంట పొలాలను సందర్శించారు. విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మహానందిలో 15 నుంచి దసరా ఉత్సవాలు



వివరాలు వెల్లడిస్తున్న చైర్మన్, ఈఓలు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానంది ఆలయ వేదపండితులు రవిశంకర అవధానితో కలిసి గురువారం వివరాలు వెల్లడించారు. వారు మాట్లాడుతూ దసరా నవరాత్రుల్లో జరిగే పూజల్లో భక్తులు రూ. 13వేలు టికెట్‌తో ఉభదాతలుగా పాల్గొనవచ్చన్నారు. ఉత్సవాల్లో భాగంగా 15న శ్రీ శైలపుత్రి దుర్గ, 16న శ్రీ బ్రహ్మచారిణీ దుర్గ, 17న శ్రీ చంద్రఘంట దుర్గ, 18న శ్రీ కూష్మాండ దుర్గ, 19న శ్రీ స్కందమాత దుర్గ, 20న శ్రీ కాత్యాయినీ దుర్గ, 21న శ్రీ కాళరాత్రి దుర్గ, 22న శ్రీ మహాగౌరీ దుర్గ, 23న శ్రీ సిద్ధిధాత్రి దుర్గ అలంకారంలో శ్రీ కామేశ్వరీ అమ్మవారికి నిత్యం పూజలు, వాహనసేవలు ఉంటాయన్నారు. శ్రీ చక్రార్చనలు, రుద్రాభిషేకం, కుంకుమార్చన, కాలార్చన పూజలు నిర్వహిస్తామని వివరించారు.

చైతన్య స్ఫూర్తి గుర్రం జాషువా



గుర్రం జాషువా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రంగస్థల కళాకారులు జయరాముడు

నందికొట్కూరు: కుల మతాల అసమానతలపై సమాజంపై తన కలంతో అనిర్వచనీయమైన రచనలు చేసి చైతన్య పరిచిన మహాకవి గుర్రం జాషువా అని రంగస్థల కళాకారుడు జయరాముడు అన్నారు. గురువారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో గుర్రం జాషువ 128వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాకారులు, ప్రజా సంఘాల నాయకులు పూలమాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాకారులు ఖాదర్‌బాబు, మధు, బ్రహ్మయ్య, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ కవి..

శ్రీశైలంప్రాజెక్ట్: అభ్యుదయ కవి గుర్రం జాషువ 128వ జయంతిని శ్రీశైలం ప్రాజెక్టులో గురువారం ఘనంగా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎ.బెనహర్, వై.శ్రీను, పి.మల్లికార్జున, వెంకటేశ్వర్లు, బాబు తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ ఆశయాలను సాధిద్దాం

ఆత్మకూరు: భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం భగత్ సింగ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అహమ్మద్‌హుసేన్, జితేంద్ర, హరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తాం

ఆత్మకూరు: కొందరు స్వార్థ రాజకీయ నాయకులు దళితుల మధ్య చిచ్చుపెట్టి రెండు వర్గాలుగా విభజించి వర్గీకరణ చేయాలని ప్రయత్నిస్తున్నారని, ఎస్సీ వర్గీకరణను తాము వ్యతిరేకిస్తామని మాలమహానాడు నాయకులు శీలం శేషు, శివ, జాతీయ అధ్యక్షుడు మునెయ్య, జిల్లా అధ్యక్షుడు రాజు, ఎర్రన్న, జయపాల్ అన్నారు. పట్టణంలోని ఎంఎం ఫంక్షన్ హాల్ నందు గురువారం మాలల ఆత్మీయ సమ్మేళన సభను నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొన్ని పార్టీలు ఎస్సీ వర్గీకరణ కోరుతున్నాయని, అయితే ఇప్పటికే సుప్రీంకోర్టు వర్గీకరణను చేయడం కుదరదని అభిప్రాయం వ్యక్తం చేసిందని చెప్పారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



నందికొట్కూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

నందికొట్కూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో వైద్య బృందం ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఈ నెల 16వ తేదీన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నెల 29వ తేదీ వరకు ఇంటింటికీ వైద్య పరీక్షలు చేస్తారు. ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మాలాంటి పేదలకు ఓ వరం. జగనన్న సీఎం అయిన తర్వాత పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేశారు. 108, 104, ఫ్యామిలీ డాక్టర్స్, ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తెచ్చారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం పేదలకు గొప్ప వరం.

– ప్రమీలమ్మ మునసిమడుగు గ్రామం, కొత్తపల్లి మండలం

ప్రతి రోజూ వైద్యుల పర్యవేక్షణ



ఫ్యామిలీ డాక్టరు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో నిత్యం వైద్య పరీక్షలు చేస్తున్నారు. జగనన్న హెల్త్ క్యాంపుల ద్వారా స్పెషలిస్టులతో వైద్య పరీక్షలు చేయించేందుకు టోకన్లు ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదల ఆరోగ్యంపై వైద్యం అందించేందుకు సీఎం వైఎస్ జగనన్న ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లోని ఏఎన్ఎంల వద్ద మందులు తీసుకునే వెసులుబాటు దక్కింది. సీఎం జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– గోవర్ధనమ్మ చింతలపల్లి గ్రామం, మిడుతూరు మండలం